తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
29 అక్టోబర్ 2026
Follow :





## గద్వాలలో కరవు ప్రకటన

**గద్వాల, అక్టోబర్ 28(జనంసాక్షి):**
తెలంగాణ ప్రభుత్వం జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రకటించిన మండలాల్లో కేటీదొడ్డి, ధరూర్, గట్టు, గద్వాల్, మల్దకల్, రాజోలి, వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్, ఎర్రవల్లి, ఇటిక్యాల, అయిజ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో తాగునీరు, పశుగ్రాసం సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. గద్వాల జిల్లా మొత్తం కరవు జాబితాలో చేరడంతో రైతులకు మేలు జరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రకటనతో జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు పని దినాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఇన్పుట్ సబ్సిడీ మరియు ఆర్థిక ప్యాకేజీ అందనుంది. కరవు పరిస్థితులపై నిరంతరం సమీక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. బ్యాంకులు కూడా వ్యవసాయ రుణాల రద్దు లేదా రీషెడ్యూలింగ్ ప్రక్రియను చేపట్టనున్నాయి. ఈ సహాయక చర్యల వల్ల జిల్లాలోని నిరుపేద కుటుంబాలకు మరియు పశుపోషకులకు పెద్ద ఊరట లభించనుంది.

## కోహెడ జెడ్పీ హైస్కూల్
## విద్యార్థుల భోజనంతో చెలగాటం



### నాసిరకం బియ్యం సరఫరా.. అధికారులపై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం

**కోహెడ, అక్టోబర్ 28 (జనంసాక్షి):**
కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి నాసిరకం బియ్యం సరఫరా చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. పాఠశాలలో భోజన పథకం అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించిన వారు, బియ్యం బస్తాల్లో భారీగా నూకలు ఉండటంతో విద్యార్థులకు సరిపడా అన్నం అందడం లేదని తెలిపారు.



నాయకుల అంచనా ప్రకారం, 50 కిలోల బియ్యం బస్తాలో 30 నుంచి 50 శాతం వరకు నూకలు ఉంటున్నాయి. వాటిని వేరు చేసిన తర్వాత 25 నుంచి 35 కిలోల బియ్యం మాత్రమే మిగులుతోందని పేర్కొన్నారు. నూకలు పూర్తిగా తొలగించకపోవడంతో వండిన అన్నం ఉండలుగా మారి తినడానికి ఇబ్బందిగా ఉంటోందని విద్యార్థులు తెలిపినట్లు వెల్లడించారు. మధ్యాహ్న భోజనంలో అప్పుడప్పుడు పురుగులు కనిపిస్తున్నాయని, కూరగాయల కూర కూడా సరిపడా అందడం లేదని విద్యార్థులు వాపోయినట్లు నాయకులు పేర్కొన్నారు.

ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రచారం చేస్తుంటే, పాఠశాలలో పరిస్థితి భిన్నంగా ఉందని ఏఐఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. బియ్యం సరఫరా కాంట్రాక్టర్‌ను సంప్రదించగా, ప్రభుత్వం 25 శాతం వరకు నూకలను అనుమతిస్తుందని, నిబంధనల ప్రకారమే సరఫరా చేస్తున్నామని చెప్పినట్లు తెలిపారు. అయితే, ఈ నిబంధనకు సంబంధించిన ఉత్తర్వులను అధికారులు బహిరంగంగా చూపించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి స్టీమ్డ్ రైస్ సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, పాఠశాలకు అలాంటి బియ్యం ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు.



ఈ సమస్యపై కోహెడ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. సరఫరా చేస్తున్న బియ్యంపై సమగ్ర విచారణ జరిపి, నాణ్యమైన ఆహారం, సరిపడా అన్నం, కూర అందించాలని కోరారు. భోజనంలో పురుగులు కనిపిస్తున్నాయన్న ఫిర్యాదుపైనా విచారణ జరిపి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్యాల శేఖర్, మండల కార్యదర్శి రాసూరి యుగేందర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



- **గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి**

**మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 27 (జనంసాక్షి):**
చిన్నచింతకుంట మండలం సీతారాంపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటించి భూ రీసర్వే పనులు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, పారిశుధ్య నిర్వహణ, పంట పొలాలను పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరును సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

**రీసర్వే పనులు వేగవంతం చేయాలి...**
గ్రామంలో మొత్తం భూమి విస్తీర్ణం, పూర్తయిన సర్వే, పెండింగ్‌లో ఉన్న భూమి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన భూమికి సంబంధించిన రీసర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారికి అవగాహన కల్పించాలని సూచించారు.



**అంగన్‌వాడీ, పాఠశాల తనిఖీ...**
అద్దె భవనంలోని రెండు గదుల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బంది, చిన్నారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర నిర్వహణకు అనువైన ప్రత్యామ్నాయ భవనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకాన్ని సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు.



**పారిశుధ్యంపై అసంతృప్తి...**
గ్రామంలోని మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడం, విచ్చలవిడిగా వ్యర్థాలు వేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామసభ నిర్వహించి, మండల పంచాయతీ అధికారుల సమన్వయంతో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

**పంటల సాగుపై సూచనలు...**
గ్రామంలోని పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్ వర్షాభావ పరిస్థితులు, సాగు చేస్తున్న పంటలు, కందుల సాగు అవకాశాలు, పంట దిగుబడిపై రైతులతో చర్చించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలపై రైతులకు సూచనలు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. దేవరకద్ర మండల పరిధిలో రహదారి పక్కన సాగు చేస్తున్న బంతిపూల తోటలను కూడా పరిశీలించి, సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దళిత ఉపసర్పంచ్‌పై సర్పంచ్ కుమారుడి వేధింపులు..!



- **రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని ఉపసర్పంచ్ ఆవేదన**
- **సర్పంచ్ కుమారుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: దళిత సంఘాల డిమాండ్**

**కోహీర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామ పంచాయతీలో దళిత ఉపసర్పంచ్ మైసయ్యను సర్పంచ్ కే.పద్మావతి కుమారుడు ప్రసాద్‌రెడ్డి వేధిస్తున్నారని ఉపసర్పంచ్‌తో పాటు దళిత నాయకులు ఆరోపించారు. తనను బహిరంగంగా అవమానిస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ, పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని మైసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు కోహీర్ మున్సిపల్ కౌన్సిలర్ సంపత్‌కుమార్ మాట్లాడారు.

గత కొన్ని రోజులుగా ప్రసాద్‌రెడ్డి తనను లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారని మైసయ్య ఆరోపించారు. గ్రామ పంచాయతీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధిగా తనకు ఉన్న హక్కులను గౌరవించడం లేదని, గ్రామ సభలకు సంబంధించిన విషయాల్లో పక్కన పెడుతున్నారని పేర్కొన్నారు. వాట్సాప్, ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లో తనను కించపరిచేలా పోస్టులు పెడుతూ రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ పరిణామాలతో తన కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోందని, భార్యాపిల్లలు భయాందోళనలతో జీవిస్తున్నారని తెలిపారు. తనకు న్యాయం చేయడంతో పాటు కుటుంబానికి రక్షణ కల్పించాలని మైసయ్య, ఆయన తల్లి శ్యామలమ్మ వేడుకున్నారు.





**అధికారులు స్పందించాలి...**

దళిత ఉపసర్పంచ్‌పై జరుగుతున్నాయని ఆరోపిస్తున్న వేధింపులను కౌన్సిలర్ సంపత్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రసాద్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలు నిర్ధారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ, రాష్ట్ర ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ ఈ ఘటనపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



**న్యాయం జరిగే వరకు పోరాటం...**

బాధితుడికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాలు, మేధావులు, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనలను ఉధృతం చేస్తామని సంపత్‌కుమార్ హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవం, భద్రతకు భంగం కలగకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో దళిత నాయకులు ముర్జల్, అలెగ్జాండర్, గాబ్రియేల్, రవికిరణ్, మున్నా, వినోద్, అవినాష్, శివకుమార్, సురేష్, మోజస్, మోహన్‌దాస్, కృష్ణ, పద్మారావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా రక్తదానం



**సదాశివపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో సదాశివపేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు కరణం సందీప్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో సీడీసీ అధ్యక్షుడు రాంరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు సిద్ధన్న, మల్లికార్జున్, సేవాదళ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన కంటారెడ్డి తిరుపతిరెడ్డి



**చిన్న శంకరంపేట, అక్టోబర్ 28(జనంసాక్షి):** మండలంలోని గజగట్లపల్లీ గ్రామానికి చెందిన సుధ బాలయ్య మరణించిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు కంటా రెడ్డి తిరుపతిరెడ్డి వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగభూషణం, ఉప సర్పంచ్ రాజు, వార్డ్ మెంబర్స్ శమయ్య, గణేష్, రమేష్, మహేష్, ప్రసాద్, శ్రీకాంత్, గ్రామ పెద్దలునాయకులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు



**శివ్వంపేట, అక్టోబర్ 27 (జనంసాక్షి):** అకస్మాత్తుగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించిన ఘటన మండల కొత్తపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నింగరబోయిన ప్రవీణ్ ఇంట్లో మంటలు చెలరేగి పక్కనే ఉన్న నింగరబోయిన వెంకటేష్ ఇంటికి వ్యాపించాయి. అనంతరం మంటలు మరింతగా వ్యాప్తి చెంది శేఖర్ ఇంటికి చేరుకోగా గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో నింగరబోయిన ప్రవీణ్ ఇంట్లో ఉన్న లక్షా 50వేల నగదుతో పాటు ఇంట్లోని సామాగ్రి కాలి బూడిద అయిందన్నారు. వెంకటేష్ ఇల్లు కొంతభాగం నష్టం జరగగా, శేఖర్ చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో ఇలాంటి ప్రాణనష్టం జరగకపోయిన భారీ ఆస్తినష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా షార్ట్ సర్క్యూట్ తోనే మంటలు చెదరేగవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

# మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించిన డిసిసి అధ్యక్షులు శేఖర్ రెడ్డి



**కంగ్టి, అక్టోబర్ 28(జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజవర్గం కంగ్టి మండల కేంద్రంలో బాలాజీ అనురాధ ఆసుపత్రి సౌజన్యంతో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టియుడబ్ల్యూ జె (ఐజేయు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించిన డిసిసి అధ్యక్షులు పట్లోళ చంద్రశేఖర్ రెడ్డి. అనురాగ్ రెడ్డి. సిఐ వెంకట్ రెడ్డి ప్రారంభించి ఆయన మాట్లాడుతూ బాలాజీ అనురాధ ఆసుపత్రి వారు TUWJ (IJU) యూనియన్ వారు నిర్వహిస్తున్న మెగా హెల్త్ క్యాంపు సంతోషకరం. జర్నలిస్టులు ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేస్తూ ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచించడం ఇలాంటి కార్యక్రమం చేయడం అభినందన విషయం అన్నారు.



ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారికి మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాణపూర్ రాజు, యూనియన్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ ఉపాధ్యక్షుడు. ఈ. వెంకటేశం...TUWJ (IJU) నియోజకవర్గ అధ్యక్షుడు జి.సత్యం. ప్రధాన కార్యదర్శి. కే భూమయ్య, ఉపాధ్యకులు. నుక్కల రాజు. రామ్ రెడ్డి. రమేష్ గౌడ్. బిరాదర్ సంగప్ప. నిసార్ జాయింట్ సెక్రటరీ. జైపాల్ రెడ్డి. ఆర్గనైజింగ్ సెక్రెటరీ వీర రెడ్డి. మండల జర్నలిస్ట్ లు. మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి

- **ప్రతి గొంతుక ప్రజాస్వామ్యంలో వినిపించాలి**



**కొమురవెల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో అర్హులైన డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్వీ నాయకులు ఏర్పుల మహేష్ సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఫారం – 18 ద్వారా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, తమ హక్కును నిర్లక్ష్యం చేయకుండా నమోదు చేసుకోని తప్పనిసరిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు, ప్రభుత్వ రంగంలో ఉన్న అధికారులు అందరూ ఈ నమోదు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాము. పట్టభద్రుల గొంతుకను శాసనమండలిలో బలంగా వినిపించాలంటే ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నాయకులు బూరుగు భరత్ గౌడ్, మకిలి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత

- **అల్లాదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుచరిత**



**అల్లాదుర్గం, అక్టోబర్ 28 (జనంసాక్షి):** బాలల భద్రత, రక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అల్లాదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ఎ.సుచరిత అన్నారు. సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ అల్లాదుర్గం నేతృత్వంలో మస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల హక్కులు, భద్రత, రక్షణ, సంక్షేమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలబాలికలపై లైంగిక వేధింపులు, అసభ్యకర ప్రవర్తనకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలలు భయం లేకుండా సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా అందరూ సహకరించాలని కోరారు.

విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, ఆన్‌లైన్ భద్రత, లైంగిక వేధింపుల నివారణ, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైన వారికి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సంజీవయ్య, ఉపాధ్యాయులు జనార్ధన్, అరుణ, పీఈటీ దేవానంద్, న్యాయ సేవల సిబ్బంది టి.ఆంజనేయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బాలల భద్రతపై న్యాయ అవగాహన కార్యక్రమాలు...




**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి):** సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముత్తంగి, ఇంద్రేశంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో బాలల భద్రతపై న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య విద్యార్థులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, మంచి స్పర్శ-చెడు స్పర్శ, లైంగిక వేధింపుల నివారణ, అంతర్జాల భద్రతపై అవగాహన కల్పించారు. అనుచిత ప్రవర్తన ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైన బాలలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మాణిక్ యాదవ్, పటాన్‌చెరు ఉపనిరీక్షకురాలు సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**బాలల భద్రతపై పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు....**

బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, బాలలపై జరిగే నేరాల నివారణ లక్ష్యంగా సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా న్యాయాధికారులు సెయింట్ ఆంథోనీ, శ్రీ చైతన్య టెక్నో, స్పెక్ట్రా, సెయింట్ ఆన్స్, శ్రీ సరస్వతి శిశు మందిర్, శ్రద్ధ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.






ఈ సందర్భంగా బాలలపై హింస, లైంగిక వేధింపులు, దోపిడీ నివారణ, వ్యక్తిగత భద్రత, మంచి స్పర్శ-చెడు స్పర్శ, అంతర్జాల భద్రత, బాలల హక్కులు, సంబంధిత చట్టాలపై వివరించారు. అసురక్షిత పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు.ప్రతి బాలుడికి, బాలికకు సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని న్యాయాధికారులు పేర్కొన్నారు. బాలల భద్రత, సంక్షేమం కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మండలంలో ఐదుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**చౌట్కూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** రైతులు పండించిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు వీలుగా మండలంలో ఐదు గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. వెండికోల్, తాడ్దాన్‌పల్లి, ఉప్పరిగూడెం, పోసానిపల్లి, బొమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా రైతులకు ధాన్యం విక్రయాల్లో ఉపయోగం కలుగునుంది. వీటిలో ఒకటి డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నాలుగు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో పనిచేయనున్నాయి.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోడపట్ల గణేష్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ, రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని కోరారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం ద్వారా రైతులు ప్రయోజనం పొందవచ్చని అన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు ఎదుర్కోకుండా సంబంధిత సిబ్బంది సహకరించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని సిద్ధం చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని నాయకులు రైతులకు సూచించారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం తదితర అంశాలపై రైతులు ముందుగానే అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా సాగితే రైతులకు సమయం ఆదా కావడంతో పాటు ధాన్యం విక్రయ ప్రక్రియ సులభతరమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి సంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నందికంటి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మి మండలం కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి సర్పంచులు మల్లారెడ్డి గోల్ల మల్లేశం అంజమ్మ సంధ్యా మల్లికార్జున్ గౌడ్ రేణుక బాలు రాజు జైపాల్ నాయక్ రాజశేఖర్ ఉప సర్పంచ్ మౌలానా మహేష్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మక్సూద్ అలీ యువజన అధ్యక్షుడు కాశీనాథ్ సంజయ్ శ్రీనివాసరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మాజీ సర్పంచ్ జయరాం రెడ్డి వెండికోల్ రాములు రాం రెడ్డి, మల్లేశం రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితోనే

# మహిళల ఆర్థిక సాధికారత




**నంగునూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి):**
మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు అధికారి సుధీర్, సర్పంచ్ బాల పోచయ్య అన్నారు. నంగునూరులో ఈడీఐఐ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ మహిళలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. ఈడీఐఐ ప్రాజెక్టు అధికారి ఎడ్మండ్ భూపతి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలతో వ్యాపారాలు ప్రారంభించి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# కుంగుబాటుకు గురికావద్దు...



**పాపన్నపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి):** విద్యార్థులు మనో ధైర్యాన్ని కలిగి ఉండాలని కుంగుబాటుకు గురికావోద్దని మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేట జడ్పీ పాఠశాలలో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు ఏదో ఒక రంగంలో విశిష్టమైన నైపుణ్యం ఉంటుందని దానిని వెలికితీసి ముందుకు వెళ్లాలన్నారు. డిగ్రీ కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ మెంటార్ ఆంజయ్య పదవ తరగతి విద్యార్థులకు వివిధ కోర్సులు, ఉద్యోగ అవకాశాల గూర్చి వివరించి,కరపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, నాగరాజు, అంజాగౌడ్, ప్రవీణ్, మోహన్ రావు, రియాజ్, విశ్వనాథ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత...

• **బసవ కళ్యాణ్ పీఠాధిపతి శ్రీ మాధవానందా సరస్వతి స్వామి**



**పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బసవ కళ్యాణ్ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి అన్నారు.. బుధవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సహజానంద సరస్వతి స్వామి వారి 16 వ వార్షిక ఆరాధన కార్యక్రమం లో ప్రత్యేక పూజలో పాల్గొని భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భక్తులు తరచూ ఆలయాలు సందర్శిస్తూ ధార్మిక చింతన కలిగిఉండాలని సర్వప్రాణుల పట్ల ప్రేమాభిమానములు కలిగి ఉండాలని హితబోధ చేశారు. ఈ ప్రత్యేక పూజలో నాచారం పీఠాధిపతి శ్రీ మధుసూదనానంద సరస్వతి స్వామి వారు మరియు బ్రాహీభూత శ్రీ సహజానంద సరస్వతి స్వామి వారి పూర్వాశ్రమ జ్యేష్ట కుమారుడు ప్రముఖ వేద పండితులు, చండీ ఉపాసకులు శ్రీ నరహరి శర్మ గారు దైవిక క్రతువు నిర్వహించారు. రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్, రాఘవేంద్ర చారి, సంతోష్ కుమార్,ప్రముఖ వేద పండితులు శిలాంకోట. ప్రవీణ్ శర్మ, గుడి. శ్రీనాథ్, శ్రీనందన్, బోగయ్యగారి, నాగరాజు శర్మ,ఆలయ పూజారి సంగప్ప మరియు స్వామివారి శిష్యులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సేవారత్న అవార్డుకు ఎంపికైన సర్పంచ్ దంపతులు





**కోహెడ, అక్టోబర్ 28 (జనంసాక్షి):**
బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందిస్తున్న ప్రతిష్టాత్మక సేవారత్న నేషనల్ అవార్డ్ 2026కు మండలంలోని వింజపల్లి గ్రామ సర్పంచ్ అన్నాడి శ్రీజ - జీవన్ రెడ్డి దంపతులు ఎంపికయ్యారు. ఉత్తమ సర్పంచ్ విభాగంలో అన్నాడి శ్రీజ, ఉత్తమ సేవ విభాగంలో అన్నాడి జీవన్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు అకాడమీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారని వారన్నారు. నవంబర్ 15న న్యూ డిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 20వ కాన్ఫరెన్స్‌లో అవార్డులు స్వీకరించనున్నట్లు జీవన్ రెడ్డి తెలిపారు. సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బీఎస్ఏ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీజ- జీవన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతోనే అవార్డు తమను వరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డు కు ఎంపిక కావడం పట్ల సర్పంచ్ దంపతులకు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

# సిద్దిపేటలో టీఆర్ఎస్ తొలి జిల్లా కార్యాలయం

• **నవంబర్ 13న కవిత చేతుల మీదుగా భూమిపూజ**



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్రంలోనే తొలి జిల్లా కార్యాలయ నిర్మాణానికి నవంబర్ 13న అధినేత్రి కల్వకుంట్ల కవిత భూమిపూజ చేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రజా సమస్యలపై పోరాడుతామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగం, నిర్వాసితుల సమస్యలు, వలసలు పెరిగాయని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని ఆరోపించారు. ఈ నెల 30న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించే పాంచజన్య సభకు జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లారం మల్లారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఇంటి తాళం పగలగొట్టి చోరీ - కేసు నమోదు

**ఊర్కొండ , అక్టోబర్ 28 (జనంసాక్షి):** ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి నగదు, వస్తువులను దొంగిలించిన సంఘటన ఊర్కొండపేటలో చోటుచేసుకుంది.

ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా ఫలం నగర్‌కు చెందిన నాజియా, ఆమె భర్త హమీద్ బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామానికి వచ్చారు. భర్తకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో 15 రోజుల క్రితం సొంత ఊరికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో ఉన్న 16 వేల నగదు, ఇతర వస్తువులు కలిపి సుమారు 20 వేల రూపాయల విలువైన సొత్తును గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాదేవి తెలిపారు.

# అవినీతి, కుట్ర రాజకీయాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్

- అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ రాజకీయాలు..తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం
- ఈవీఎంలను తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ .. అదే ఈవీఎంల ద్వారా రెండుసార్లు అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఈవీఎంలపై బురద చల్లుతారా
- సీఎం సొంత ఊరుకొండారెడ్డిపల్లికి వెళ్దాం.. ఎవరి ఓటు పోయిందో చూద్దాం
- ఫామ్-6 నింపడం చేతకాదు... ధర్నాలు చేస్తారు ..ఎస్.ఐ.ఆర్ అంటే రాజ్యాంగ హక్కు
- ఓట్లు పోయాయని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్
- సింగూరు జలాలు సంగారెడ్డి ప్రాంత ప్రజల హక్కు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**సంగారెడ్డి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై రాజకీయాలు చేస్తూ, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేయడంపై ఆయన ప్రశ్నించారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, కొత్త ఓటర్ల పేర్లను చేర్చడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించడం దీని ఉద్దేశమని తెలిపారు. ఓట్లు తొలగిపోయాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఎంతమంది ఓటు హక్కు కోల్పోయారో ఆధారాలతో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు కోల్పోయినవారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి వెళ్లి, ఎవరి ఓట్లు తొలగిపోయాయో పరిశీలించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్నారని నిరూపించగలరా అని ప్రశ్నించారు. ఈవీఎంలను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని, అదే ఈవీఎంల ద్వారా గతంలో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఓటుచోరీ పేరుతో ప్రజల్లో అనవసర భయాలు సృష్టించవద్దని సూచించారు.

**సింగూరు జలాలు సంగారెడ్డి ప్రజల హక్కు...**

సింగూరు జలాలను హైదరాబాద్‌కు కేటాయించడంపై కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. సంగారెడ్డి ప్రాంత ప్రజలకు సింగూరు జలాలే ప్రధాన ఆధారమని,



నీటిని దిగువకు విడుదల చేయడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. హైదరాబాద్‌కు ఇతర మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, నాయకులు మాణిక్యరావు, కసినివాసు, దోమల విజయ్, మందుల నాగరాజు, నరేన్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



## అక్షర జ్ఞానాన్ని అందించిన బడికి చిరు కానుక

- ఎమ్మెల్యే బర్త్ డే సందర్భంగా సౌండ్ సిస్టమ్ అందజేత

**హత్నూర, అక్టోబర్ 28 (జనంసాక్షి):** పసివాడిగా బడిలో అడుగుపెట్టిన తనను అక్కున చేర్చుకుని తన ఒడిలో అక్షరాలను దిద్దించి జ్ఞానాన్ని అందించిన బడికి తనవంతు సహాయం అందించాలని తపించాడు.హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన అజ్మత్ (అజ్జు) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వారి సమక్షంలో పాఠశాలకు సౌండ్ సిస్టమ్‌ను బహుమానంగా అందజేశారు.

విద్యార్థుల సౌకర్యార్థం బడికి సౌండ్ సిస్టమ్ అందజేసిన అజ్మత్ ను పలువురు అభినందించారు.కార్యక్రమంలో ఉప సర్పంచి శేఖర్, మాజీ ఎంపీపీ నర్సింలు,పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఈ అభ్యస్ విద్యార్థులకు వరం



**తూప్రాన్, అక్టోబర్ 28(జనంసాక్షి):** ఈ అబ్యాస్ విద్యార్థులకు వరం లాంటిదని ఈ అబ్యాస్ ఫౌండర్ పవన్‌పని శాస్త్రి తెలిపారు. తూప్రాన్ గీతా స్కూల్లో ఐ.ఐ.టి, ఈ – అభ్యాస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభను వెలికితేసే కార్యకమంలో తూప్రాన్ గీతా పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మ్యాథ్స్, సైన్స్ విభాగాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ వారికి తగు సూచనలిస్తూ భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ఈ అభ్యాస్ అకాడమీ విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్బంగా పాఠశాల చైర్మన్ ఉష మాట్లాడుతూ. ఈ అభ్యాస్ అకాడమీ విద్యార్థులకు ఒక వరం లాంటిదని అన్నారు. భవిష్యత్తులో పోటీని ఎదుర్కునేలా ఆ అభ్యాస్ శిక్షణ ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఈ అభ్యాస్ ఫౌండర్ భువనగిరి పవన్ ఫణి శాస్త్రి, కరెస్పాండెంట్ రామాంజనేయులు, డైరెక్టర్లు భరత్, డాక్టర్ మౌనిక ప్రిన్సిపాల్ అరుణ, ప్రేమ్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నంగనూరు మండలంలో బిఆర్ఎస్‌వి నూతన గ్రామ కమిటీల ఎన్నిక



**నంగనూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావు గారి ఆదేశాల మేరకు నంగనూరు మండల బి ఆర్ఎస్వి సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నాగరాజుపల్లి, ఖానాపూర్, ఘనపూర్, ఖాతా, కొండంరాజుపల్లి గ్రామాల్లో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ప్రతి గ్రామానికి 15 మందితో కూడిన విద్యార్థి విభాగ కమిటీలను ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నాగరాజుపల్లిలో పాకాల శివ ఖానాపూర్‌లో శ్రీకాంత్ ఘనపూర్‌లో ఆంజనేయులు ఖాతాలో శివ రాత్రి వంశీ కొండంరాజుపల్లిలో తుంగ విష్ణు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్వి నాయకులు పాల్గొన్నారు.

## కోహెడను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి...

- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం

**కోహెడ, అక్టోబర్ 28 (జనంసాక్షి):** కోహెడ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ ఆధ్వర్యంలో కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం మాట్లాడుతూ, కరువు పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కోహెడను కరువు మండలంగా ప్రకటించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కోహెడ మండలంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారా అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే కరువు మండలంగా ప్రకటించి, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం, ఇతర సహాయక చర్యలు అందించాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కోహెడ రైతాంగానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచులు మ్యాకల స్వర్ణలత, పకీడే సంపత్, కాతం ఆమూల్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మ్యాకల రజినీకాంత్ రెడ్డి, పిల్లి నర్సయ్య, మండల నాయకులు ఖమ్మం సతీష్, సామల గిరిధర్, దానవేని రాజయ్య, కంది సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి...

- నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలి
- అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచన

**ఉప్పునుంతల (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, తీవ్రమైన ఎండలు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు చేపట్టాలని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. ఉప్పునుంతల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న కాలంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్తు కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తాగునీటిని, సాగునీటిని అవసరానికి తగినంత మాత్రమే వినియోగిస్తూ పొదుపు పాటించాలని కోరారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు బోరుబావుల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడా తాగునీటి కొరత ఏర్పడకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేసవిలో విద్యుత్తు వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైనప్పుడే విద్యుత్తును వినియోగించాలని, అనవసరంగా లైట్లు, విద్యుత్తు పరికరాలను ఆన్‌లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు వీబీ–జీ రామ్‌జీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు నిబంధనల ప్రకారం ఎక్కువ పని దినాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు రానున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## ఉష్ణమండల వ్యాధుల నివారణకు ఉమ్మడి కృషి అవశ్యం: డాక్టర్ అహ్మద్





**పటాన్చెరు, అక్టోబర్ 28 (జనంసాక్షి):** నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధులను ఎదుర్కోవాలంటే శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, సామాజిక పరిశోధకులు కలిసి పనిచేయాలని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, జీవశాస్త్రాల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ స్పష్టీకరించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్) యొక్క సంస్థాగత పరిశోధన కమిటీ, తన పరిశోధన సదస్సుల శ్రేణిలో భాగంగా ఎనిమిదవ సెమినార్ ను బుధవారం నిర్వహించింది. 'వేడెక్కుతున్న ప్రపంచం కోసం వ్యాక్సిన్ ల రూపకల్పన: డెంగ్యూపై పోరాటంలో విజ్ఞానం, సమానత్వం, విధానం' అనే శీర్షికన దీనిని ఏర్పాటు చేశారు.
డాక్టర్ అహ్మద్, డెంగ్యూ వ్యాప్తిపై వాతావరణ మార్పులు, పర్యావరణ కారకాల ప్రభావాన్ని వివరిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డెంగ్యూ ముప్పు గురించి చర్చించారు. వ్యాక్సిన్ ఆవిష్కర్తలుగా తమ ప్రయోగశాల ఈ సమస్యను ఎలా పరిష్కరించిందో ఆయన వివరించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రాథమిక, ప్రీ-క్లినికల్ దశలో ఉన్నప్పటికీ, ఈ రంగాన్ని వెనక్కి నెట్టిన భద్రత, సమర్థతకు సంబంధించిన రాజీలను, మరింత తెలివైన వ్యాక్సిన్ రూపకల్పన ద్వారా పరిష్కరించవచ్చని ఇవి చూపిస్తున్నాయన్నారు. పలువురు అధ్యాపకులు ఈ చర్చలో చురుకుగా పాల్గొని, పలు సందేహాలపై వివరణలు కోరడంతో పాటు డాక్టర్ అహ్మద్ పరిశోధనా నైపుణ్యాన్ని, స్పష్టమైన వివరణను ప్రశంసించారు.

## కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ...






**పుల్కల్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ శంకర్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ట్రంకు పెట్టెల విక్రయానికి సంబంధించి బుధవారం వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో ఆయన పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్ ఓ ఇందిర ట్రంకు పెట్టెలను విక్రయించిన వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎంఈఓ శంకర్ పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లా అధికారుల ఆదేశాలు, సంబంధిత ప్రొసీడింగ్స్ ప్రకారమే ట్రంకు పెట్టెలను విక్రయించినట్లు ఆయన వివరణ ఇచ్చారు.
అయితే, ట్రంకు పెట్టెల విక్రయానికి సంబంధించిన అనుమతులు, ప్రొసీడింగ్స్, విక్రయ ప్రక్రియకు సంబంధించిన వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సంబంధిత రికార్డులను పరిశీలిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## విద్యార్థుల్లో ఈ - వ్యర్థాల నిర్వహణపై అవగాహన



**తూప్రాన్, అక్టోబర్ 28(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వ ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ స్పెషల్ కాంపెయిన్ -6 లో భాగంగా తూప్రాన్ గీత హై స్కూల్ లో విద్యార్థులకు బుధవారం పాత ఎలక్ట్రానిక్ వస్తువులను బాధ్యతాయుత సేకరణ, వాటి వల్ల పర్యావరణానికి కలిగే సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి పర్యావరణానికి హాని కలగకుండా భూమిని రక్షించాలని గీత స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయులు తెలిపారు. ఈ -ఎలక్ట్రానిక్ వస్తువులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులు, నిరంతరం కొత్త-కొత్త అంశాలను నేర్చుకోవాలని ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, భరత్, డాక్టర్ మౌనిక ప్రిన్సిపాల్ అరుణ, ఇంచార్జి ప్రిన్సిపాల్‌ప్రేంరాజ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయరంగ అభివృద్ధికి ఆధునిక పద్ధతులు కీలకం

- రైతులకు నూతన సాగు విధానాలపై అవగాహన కల్పించిన అధికారులు



**అచ్చంపేట, అక్టోబర్ 28(జనంసాక్షి):** రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వినియోగం, పంటల దిగుబడి పెంపుపై అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుకోవడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పంటలకు అవసరమైన పోషకాలను అందించడం వంటి అంశాలపై రైతులకు వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువులు, ప్రకృతి ఆధారిత సాగు విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగునీటి పొదుపు, పంటల మార్పిడి, నూతన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ చంద్రశేఖర్ ఎంఏఓ కృష్ణయ్య. ఏఈవో ప్రియా. ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం విజయవంతం

- 113 మంది రక్తదానం.. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్



**తూప్రాన్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సహాయం అందించేందుకు మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం మనోహరాబాద్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 113 మంది రక్తదానం చేశారు.
ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ తాను ప్రతి సంవత్సరం రక్తదానం చేస్తానని, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానంపై అపోహలు వీడాలని, రక్తదానం చేసిన తర్వాత శరీరంలో రక్తం తిరిగి ఉత్పత్తి అవుతుందని వివరించారు. తలసేమియా చిన్నారులకు తరచూ రక్తం అవసరమవుతుందని, వారికి సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువకులు, స్వచ్ఛంద సేవకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 113 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులకు అండగా నిలిచారు. రక్తదానం ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆశను కల్పిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్, సీఐ వెంకటరాజ గౌడ్, తూప్రాన్ ఎస్ఐ సుభాష్, ఎస్ఐ గంగరాజు, రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చిట్కుల మహిపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు విట్టల్ రెడ్డి, పెంట గౌడ్, కళ్యాణ్, బిక్షపతి, మహేందర్, పురం రవి తదితరులు పాల్గొన్నారు.





## రూపురేఖలు మారనున్న దేవరగట్టు రోడ్డు



**మల్దకల్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** డిసెంబర్ నెలలో జరిగే శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు దేవరగట్టు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు అనువైన రోడ్డుగా ఉండేందుకు ఆలయ వ్యవస్థాపక వంశీయులు పట్వారి ప్రహ్లాదరావు సంకల్పంతో భక్తుల సహాయ సహకారాలతో రోడ్డు పనులను చేపడుతున్నారు. దేవాలయ వెనుక భాగంలోని చౌరస్తాగా ఏర్పాటు చేసి అక్కడ పురేందర్ దాసుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్నారు. పెద్దోడి గ్రామానికి చెందిన రాముడు విగ్రహానికి దాతగా ఏర్పడడంతో బ్రహ్మోత్సవాల కల్లా విగ్రహాన్ని పెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అక్కడనే ఆర్చ్ గేటు ఏర్పాటు చేసి దేవరగట్టు రోడ్డుకు పూర్వ వైభవం రానున్నది. మొదటి దశలో చెట్లను తొలగించి రోడ్డును విశాలంగా చేసి మట్టిని తరలించి బాగు చేస్తున్నారు. ప్రతి సంవత్సరము శ్రావణమాసంలో గంప జాతర, విజయదశమి పండుగ రోజు స్వామివారు దేవరగట్టుకు వెళ్లి వస్తుంటారు. రాను రాను జాతర కూడా అక్కడికే తరలించి దేవరగట్టును అభివృద్ధి పరిచేందుకు కంకణం బద్దులు కట్టుకున్నారు.

## రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం జాయింట్ సెక్రటరీగా ఎన్నం సత్యనారాయణ గుప్తా

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలో కీలక పాత్ర



**మిడ్జిల్, అక్టోబర్ 28(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ తాలూకా ప్రజ్ఞాపూర్ లో నిర్వహించిన రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా స్థాయిలో రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎన్నం సత్యనారాయణ గుప్తాకు రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించడంపై జిల్లా రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. డీలర్ల సమస్యలు, కమీషన్లు, గౌరవ వేతనం, సంక్షేమ అంశాల పరిష్కారానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.



# క్రీడాకారులకు అండగా ఎమ్మెల్యే జిఎంఆర్..





పటాన్‌చెరు అక్టోబర్ 28 (జనంసాక్షి): నవంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా జరగనున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి కుస్తీ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న అండర్-17 బాల బాలికల జట్లకు ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. బుధవారం సాయంత్రం పటాన్చెరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పటాన్చెరు కేంద్రంగా ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం జరిగిందని తెలిపారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర జట్టుకు లక్ష 50 వేల రూపాయల సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్స్, భోజన వసతి, ప్రయాణ ఖర్చులు అందించడం జరిగిందని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జాతీయస్థాయిలో అద్భుతమైన ప్రదర్శనతో తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎంఈఓ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీధర్ చారి, మాణిక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, షకీల్, దస్తగిరి, కోచ్ సంగ్రామ్, పిఈటీ గౌసుద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# బుసారెడ్డిపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి...

- నిరుపేదలకు ఇంటి స్థలాలు, మౌలిక వసతులు కల్పించండి
- మంత్రి దామోదర రాజనర్సింహకు సర్పంచ్ రేణుక వినతి





మునిపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి): మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ హస్నాబాద్ రేణుక వెంకట్ రాములు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఆందోల్ ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహను కోరారు. బుధవారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్లు 127, 415 పరిధిలో గుర్తించిన భూమిలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. మల్లన్నస్వామి ఆలయం, బతుకమ్మ కట్ట వద్ద విద్యుత్ సౌకర్యం కోసం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, తీగలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 800 మీటర్ల సీసీ రోడ్లు, 1,500 మీటర్ల మురుగు కాలువలు, నూతన గ్రామ పంచాయతీ భవనం, రెండు బోరుబావులు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. మైనారిటీ, ఎస్సీ కాలనీల్లో స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టి, కంకర రహదారులు నిర్మించాలని విన్నవించారు. గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. నిరుపేదలకు ఇంటి స్థలాల కేటాయింపును వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక వసతుల కల్పనతో గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## చేర్యాల గురుకుల పాఠశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



చేర్యాల, అక్టోబర్ 28 (జనంసాక్షి): స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం సైబర్ సేఫ్టీ ప్రాజెక్టు నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రిన్సిపల్ పోలోజు నరసింహ చారి అధ్యక్షతన చర్యాల పోలీస్ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ మోసాలు, లోన్ యాప్ వేధింపులు, దినదినం పెరిగిపోతున్న సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. మ్యాట్రిమోనియం మోసాలు, ఇన్వెస్ట్మెంట్ మోసాలు, క్రైవేస్ ఫ్రాడ్, డీప్ ఫేక్ ఫ్రాడ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో చేర్యాల పోలీసు డిపార్ట్మెంట్ నుండి అఫ్రోజ్ సంతోష్, కిరణ్ తో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానం.. మరొకరికి ప్రాణదానం..!

- 45 వ సారి రక్తదానం చేసిన సంతోష్ రావు



రేగోడ్, అక్టోబర్ 28 (జనంసాక్షి): రక్తదానం మరొకరికి ప్రాణదానమని రక్తదానం దాత టీ లింగంపల్లి సంతోష్ రావు తెలిపారు. బుధవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మెదక్ లోని పోలీస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి రేగోడు మండలం నుండి వెళ్లి రక్తదానం చేయడం జరిగిందని సంతోష్ రావు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, రక్తహీనత, క్యాన్సర్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరమని తెలిపారు.
రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాకపోవడంతో ఆరోగ్యంగా ఉన్న అర్హులైన వ్యక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా రక్త నిల్వలను పెంచవచ్చని ఒక యూనిట్ రక్తాన్ని భాగాలుగా విభజించడం ద్వారా ఒకరికి మించి పలువురికి ఉపయోగపడే అవకాశం ఉందని తెలిపారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ఉద్యోగులు రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని,మన శరీరం నుంచి ఇచ్చే కొద్దిపాటి రక్తం.. మరొకరి కుటుంబంలో చిరునవ్వును, ఒక మనిషికి కొత్త జీవితాన్ని అందించగలదని, "రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



హత్నూర, అక్టోబర్ 28 (జనం సాక్షి): పిఏసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి అన్నారు.మండలంలోని చందాపూర్,మంగాపూర్ గ్రామాల్లో ఐకెపి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం వారు ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా కొనుగోలు చేయాలన్నారు.రవాణా, హమాలి, గన్ని బ్యాగుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, నాయకులు, అజ్మత్ అలీ,శ్రీకాంత్, కృష్ణ, ఇబ్రహీం,రమేష్,పండుగ, రవి,నరేందర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక సభలో గందరగోళం

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల అయూబ్ పాషా



ఊర్కొండ, అక్టోబర్ 28 (జనంసాక్షి); మండల సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కావాలనే గందరగోళం సృష్టించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయూబ్ పాషా డిమాండ్ చేశారు. ఇదంతా అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆయన ఆరోపించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి పనులను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే కొందరు నాయకులు సభలో గందరగోళం సృష్టించారని, గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, బీటీ రోడ్లు వంటి అభివృద్ధి పనులు ఘనంగా జరుగుతున్నాయని, దమ్ముంటే అభివృద్ధి విషయంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో హైలైట్ కోసమే కొందరు ఇలా చేస్తున్నారని, ఇంకోసారి గందరగోళం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఊర్కొండ అభివృద్ధే ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్పంచులు, ఉప సర్పంచ్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రేగోడ్ మండలాన్ని ప్రభుత్వం వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- ప్రతి ఎకరాకు 35,000/- రూ నష్టపరిహారం చెల్లించాలి
- పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, బిఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్ డిమాండ్





రేగోడ్, అక్టోబర్ 28 (జనంసాక్షి): మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రేగోడ్ మండల బిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్,మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సుంకె రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసంవత్సరం వర్షాభావ పరిస్థితులు, పంటల దిగుబడి తగ్గడం, పెట్టుబడి ఖర్చులు పెరగడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,పంట సాగు కోసం అప్పులు చేసి పంటలు వేసిన రైతులు వారు ఆశించిన స్థాయిలో దిగుబడి రాక ఆర్థికంగా చాలా నష్టపోయారని తెలిపారు.రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**బిఆర్ఎస్ పార్టీ తరపున రైతుల కోసం ప్రభుత్వానికి మా ప్రధాన డిమాండ్లు...**

1.మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలాన్ని ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి.
2.మండలంలోని అన్ని గ్రామాల్లో పంటల నష్టంపై సమగ్ర క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలి.
3.పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.35,000 /- చొప్పున నష్టపరిహారం చెల్లించాలి.
4.అర్హులైన రైతులందరికీ ఎలాంటి జాప్యం లేకుండా నష్టపరిహారం అందించాలి.
5.రైతుల పంట రుణాలపై ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రుణ ఉపశమనం కల్పించాలి.
6.రాబోయే పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ప్రత్యేక సహాయం అందించాలి. రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుంది – వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. రైతుల కన్నీళ్లు తుడవడం ప్రభుత్వ బాధ్యత. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితిని పరిశీలించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి. రేగోడ్ మండల రైతులకు న్యాయం జరిగే వరకు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాలి. రైతుల పక్షాన మా స్పష్టమైన డిమాండ్ రేగోడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి – ప్రతి ఎకరాకు రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని అన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బుద్ధారం విద్యార్థినులు



గోపాలపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి): బుద్ధారం ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. గోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం. పుష్ప రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా, తొమ్మిదో తరగతి విద్యార్థిని కృష్ణవేణి స్టాండ్‌బై క్రీడాకారిణిగా ఎంపికైంది. ఈ నెల 29 నుంచి 31 వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరిగే అండర్-14 పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు ఆర్. భాస్కర్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.డి. కిజర్ బాబా అభినందించారు.

# భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించిన సిద్దిపేట కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి):** బుధవారం కొమురవెల్లి మండలం తపాస్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యపు పూర్వం చేసిన భూముల సర్వే మళ్ళీ ఇప్పుడు భూముల సర్వే చేయడం జరుగుతుందని, పెరిగిన జనాభా ఆధారంగా భూ సమస్యలు ఎక్కువ మొత్తంలో పెరిగాయని దీనికి శాశ్వత పరిష్కారం అందించడం కోసం ప్రభుత్వం భూ-భారతి రీ-సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంత సర్వే జరిగిందనే విషయాలను అధికారులతో ఆరా



తీశారు. రీ-సర్వే లో వేగం పెంచాలని ఉదయం మొదలు పెట్టి రోజు 40 ఎకరాల పైన సర్వే చేసేలా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలు తదితర అంశాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. సర్వే లో ప్రతిదీ రెవెన్యూ రికార్డులో పొందు పరచాలని, సర్వే చేసిన భూ వివరాలను సంబంధిత భూమి యజమానులకు తెలియజేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. భూ భారతి రీ-సర్వేకి రైతులు సహకరించాలని, దీని ద్వారా హద్దులు, సర్వే నెంబర్ బై నంబర్ల సమస్య తలెత్తకుండా పగడ్బందిగా నిర్దేశించుకోవడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్, స్థానిక సర్పంచ్ , ప్రజా ప్రతినిధులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీ జరిగింది కాంగ్రెస్ హయాంలోనే

- దొంగ ఓట్లు తీసేస్తే సమర్థించేది కాంగ్రెస్ పార్టీనా ....
- మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి



**నారాయణఖేడ్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** సర్ ప్రక్రియపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ పాల్‌రెడ్డి విమర్శించారు. ఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మేధావులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇత ర దేశాలవారు, అనర్హులు ఓటర్లుగా ఉండరాదనే సర్ ప్రక్రియను 1952 నుంచి నిర్వహిస్తూ రావడం జరుగుతోందన్నారు. ఒక ఓటరు ఒకచోటే నమోదై ఉండాలన్నారు. దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తూ దొంగఓట్లు పోతున్నాయనే సర్ ప్రక్రియపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని ఆరోపించారు. అలజడులతో దేశాన్ని అస్థిర పర్చేందుకు యత్నిస్తోందన్నారు. విష ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. మేధావులు ప్రజలకు విషయాన్ని వివరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి , రాజశేఖర్, కోణం విఠల్, మారుతిరెడ్డి, రజనీ కాంత్, శ్రావణ్ రాజుగౌడ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## తొగర్‌పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు



**కొండాపూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** మండల పరిధిలోని తొగర్ పల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వై. ప్రభు మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సేవలను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించవచ్చని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ రేషన్ సరుకులు సక్రమంగా అందించడంతో పాటు, పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంపొందించేందుకు ఈ కార్డులు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హు లైన ప్రతిఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచా యతీ అధికారి విఠల్, ఉపసర్పంచ్ వినయ్, స్థానిక ప్రజాప్రతినిధు లు, సంబంధిత అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హనుమాండ్ల కుంటకు మహర్దశ



**నిజాంపేట్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** మండలంలోని మాణిక్ నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో హనుమాండ్ల కుంట మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇరిగేషన్ శాఖ ఏఈ పనులకు శ్రీకారం చుట్టారు. దీర్ఘకాలంగా మరమ్మతులకు నోచుకోని కుంటకు పునరుద్ధరణ పనులు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులతో కుంటకు పూర్వ వైభవం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల శ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్...

**చేర్యాల, అక్టోబర్ 28 (జనంసాక్షి):** చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో విద్యుత్ ఎస్ఎస్ టు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండి ఎప్పుడు కూలిపోతుందో నని భయాందోళనలో



రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ గత కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ కు ఏర్పాటుచేసిన కరెంటు పోల్స్ మొత్తం సలాకల్ తేలి కూలిపోయే పరిస్థితి నెలకొంది ప్రమాదం జరిగే పరిస్థితి వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి అట్టి ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని రైతులు కోరుతున్నారు.

## హరీష్‌రావు చేతుల మీదుగా హలో తెలంగాణ యాప్ ప్రారంభం

**సిద్దిపేట, (జనంసాక్షి):** తెలంగాణ ప్రాంత ప్రజలకు మరింత సమా చారాన్ని అందించడం కోసం ఉదయ్ కిరణ్ రెడ్డి తయారు చేసిన హలో తెలంగాణ సోషల్ మీడియా యాప్ ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు బుధవారం



సిద్దిపేటలో ప్రారంభించారు. తెలంగాణ ప్రజలను, తెలంగాణ ప్రాంతాలను, తెలంగాణ ఆలోచనలను కలిపే సోషల్ మీడియా వేదిక యాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, గుండు భూపేష్ , పాల సాయిరాం, కొండం సంపత్ రెడ్డి, శ్రీహరి యాదవ్, ఎడ్ల సోమిరెడ్డి కుంభం ఎల్లారెడ్డి, రమేష్ గౌడ్, తిరుపతి, కనకరాజు, జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్ రెడ్డి, కూతురు రాజిరెడ్డి రమణారావు, రంగ దాంపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చింతా ప్రభాకర్

**కొండాపూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** మండల పరిధిలోని మల్కాపూర్, తొగరుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొను గోలు కేంద్రాలను చింతా ప్రభాకర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను



సజావుగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సకాలంలో కొనుగోలు చేయాలని, అవసరమైన పట్టాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అనంతరం టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సుభానంద్ రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందడంతో, చింతా ప్రభాకర్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విట్టల్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, తవరపల్లి గ్రామ సర్పంచ్ దివ్యవాణి ప్రశాంత్ గౌడ్, ఉపసర్పంచ్ ఆక్కమోళ్ల వినయ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తొగరుపల్లి గ్రామ అధ్యక్షుడు ఎర్రోళ్ల రవి, సహకార సంఘాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాగపూరి పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన




**చేర్యాల, అక్టోబర్ 28 (జనంసాక్షి):** నాగపూరి ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడాలనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బండమీది సంతోషి కరుణాకర్, ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య కరపత్రాలను విడుదల చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్, కాగితం, బట్ట సంచులు ఉపయోగించాలని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కర్రోళ్ల స్వర్ణకుమార్ సూచించారు. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపడతామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ సందీప్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేట డిపోలో దివ్యాంగుల బస్ పాస్ మేళా



**నారాయణపేట, అక్టోబర్ 28(జనంసాక్షి):** నారాయణపేట ఆర్టీసీ డిపో లోబుధవారం భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు, ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్ పాస్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 20 బస్ పాసులకు దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా, నారాయణ పేట డిపో మేనేజర్ వై యాక న్న, హాజరయ్యారు. ఈ సందర్భంగా, కావలి నర్సిములు మాట్లా డుతూ, ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చునే విధంగా, కండక్టర్, డ్రైవర్లకు,తగు సలహాలు సూచనలు ఇవ్వాలని సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్ పాస్ కంట్రోలర్ (ఏ డి సి )దేవుజ, బస్ పాస్ సెక్షన్ ఇంచార్జి పకీరప్ప, నారాయణ పేట జిల్లాలోని, వివిధ మండలా లలోని, గ్రామాల దివ్యాం గులు,ప్రవీణ్ కుమార్, రాజు మోహన్,ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత క్లిక్‌తోనే సురక్షిత బాల్యం



**నారాయణపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి):** డిజిటల్ ప్రపంచంలో పిల్లలు సురక్షితంగా ఇంటర్నెట్‌ను వినియో గిస్తేనే భవిష్యత్తు భద్రంగా ఉంటుందని సివిల్ జడ్జి సాయి మనోజ్ అన్నారు. 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా పట్టణంలోని సివిల్ లైన్స్ ప్రభుత్వ పాఠశాలలో 'సురక్షిత క్లిక్.. సురక్షిత బాల్యం' కార్యక్రమం నిర్వహించారు. తప్పుడు క్లిక్‌లతో పిల్లలు ప్రమాదాల్లో పడే అవకాశం ఉందని, సైబర్ భద్రతపై అవగాహన పెంచు కోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించాలన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయసహాయం, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు లక్ష్మీపతి తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ సమీక్ష

**ఉప్పునుంతల (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ ఉప్పునుంతల మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు తోళ్ల మహేష్ యాదవ్ అధ్యక్షతన బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు, రాష్ట్ర నాయకులు కట్ట సుధాకర్, జానకి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు, ఓటరు నమోదు ప్రక్రియ, పార్టీ నాయకులు, కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌ఛార్జి రామకృష్ణ రెడ్డి, జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి శంకర్, టౌన్ కన్వీనర్ ఆంజనేయులు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సురేందర్ రెడ్డి, జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి శివశంకర్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కబడ్డీ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లాలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 21 వరకు జరిగే క్రీడా పోటీల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన కబడ్డీ జట్లు పాల్గొననున్నాయని, సుమారు 300 మంది క్రీడాకారులు జిల్లాకు రానున్నారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల నిర్వహణ జిల్లాకు గర్వకారణమని, అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సేవలు కల్పించాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణం, ఇండోర్ స్టేడియంతో పాటు పోటీలకు ఎంపిక చేసిన వేదికలను పరిశీలించి, అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలన్నారు. వసతి కోసం గుర్తించిన హాస్టళ్లు, భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సామర్థ్యం, సౌకర్యాలు, మరమ్మతుల వివరాలతో నివేదికలు సమర్పించాలని తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి కల్పించాలని, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులను వసతి కేంద్రాల నుంచి క్రీడా ప్రాంగణాలకు తరలించేందుకు బస్సులు, ఇతర వాహనాలతో రవాణా ప్రణాళిక రూపొందించాలన్నారు. వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.




ప్రతి వసతి కేంద్రానికి సమన్వయ అధికారిని నియమించి, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శాఖలవారీగా బాధ్యతలు, పనుల అంచనాలు, పూర్తిచేసే గడువులను నిర్ధారించాలని తెలిపారు. జాతీయస్థాయిలో మహబూబ్‌నగర్ జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్పీ డి. జానకి, అదనపు కలెక్టర్ హరిప్రియ, డీఆర్వో నిర్మల, అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి, క్రీడలు, పర్యాటక శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో ఆసుపత్రి సమస్యలు తీర్చకపోతే పోరాటం

- మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, అక్టోబర్ 28 (జనంసాక్షి):** జడ్చర్ల 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తీవ్రంగా వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరతను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ధ రెడ్డిపై ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ సి. లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన 30 రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పరిశీలించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్యులను,



పారామెడికల్ సిబ్బందిని వెంటనే నియామకం చేయాలని, అలాగే స్థానిక ప్రజల సౌకర్యార్థం పాత దవాఖానా ప్రాంగణంలో చిన్న చిన్న వ్యాధులకు చికిత్స అందించేలా ఓపీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రి నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందిన ఎమ్మెల్యే, తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆసుపత్రికి వాస్తు సరిగ్గా లేదు అంటూ నెపం నెట్టే ప్రయత్నం చేయడం హాస్యాస్పదమని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వానికి నిజంగానే కొత్త ఆసుపత్రి భవనాన్ని నిర్మించాలనే చిత్తశుద్ధి ఉంటే, వెంటనే రెండు నుండి మూడు ఎకరాల భూమిని కేటాయించి హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు హ్యాండ్‌ఓవర్ చేయాలని మాజీ మంత్రి సవాల్ విసిరారు. భూమిని అప్పగిస్తే తన సొంత ఖర్చులతోనే నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. విధించిన 30 రోజుల గడువులోగా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకపోతే, డిసెంబర్ మొదటి వారంలో జడ్చర్ల పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాలు, నిరసన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన నీలం మధు, చంద్రశేఖర్ రెడ్డి

**కంగ్టి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** రామాయణ రచయిత వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శప్రాయుడని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్



రెడ్డి అన్నారు. మండలంలోని చాప్టా (కె) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని స్వామీజీలతో కలిసి ఆవిష్కరించారు. యువత వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని, హక్కుల సాధనకు ముదిరాజులు ఐక్యంగా ఉండాలని నీలం మధు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నీటి లభ్యత ఆధారంగానే యాసంగి పంటల సాగు

**మద్దూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి):** యాసంగిలో నీటి లభ్యతను అంచనా వేసుకొని పంటలు సాగు చేయాలని కోస్గి సహాయ వ్యవసాయ అధికారి నూతన్ కుమార్



సూచించారు. దోరేపల్లిలో 'ఖేత్ బచావో అభియాన్'లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి సాగు తగ్గించి, శనగ, పెసర, మినుము వంటి పప్పుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేల ఆరోగ్యానికి సేంద్రియ పదార్థాలు, సమతుల్య ఎరువులు వినియోగించాలని, పంట అవశేషాలను నేలలో కలియదున్నాలని సూచించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఎం.వి. రామన్ హైస్కూల్లో ఘనంగా 'స్పేస్ ఆన్ వీల్స్'

**ఆత్మకూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** ఇస్రో, కేవ-ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఎం.వి. రామన్ హైస్కూల్లో బుధవారం 'స్పేస్ ఆన్ వీల్స్' కార్యక్రమం నిర్వహించారు.



ఇస్రో-ఎన్ఆర్ఎస్‌సీ ప్రతినిధి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాలు, రాకెట్లు, గ్రహాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ జి. గిరిబాబు విద్యార్థులు క్రమశిక్షణతో, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు.



సీఐ శివకుమార్ బాధ్యతాయుత ప్రవర్తన ప్రాముఖ్యతను వివరించారు. ఎంఈఓ శ్రీనివాసులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సైన్స్ ప్రయోగశాలల ద్వారా మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కుల పరిరక్షణే ఎస్ఎఫ్ఐ లక్ష్యం

**బాలానగర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యారంగ అభివృద్ధి, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ బాలానగర్ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



గా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. విద్యార్థుల హక్కుల సాధనకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.

## కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బిగ్ షాక్

**ఇది ఎన్డీఏ విజయం - మండల బీజేపీ అధ్యక్షులు నర్సప్ప**

**కృష్ణ, అక్టోబర్ 28 (జనంసాక్షి):** కర్ణాటకలో అక్టోబర్ 23న జరిగిన 4 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాభవం ఎదురైందని 4 స్థానాలకు గాను 3 స్థానాల్లో భారతీయ జనతా పార్టీ, ఒక స్థానంలో ఎన్డీఏ మిత్రపక్షం జేడిఎస్ విజయం సాధించాయని కృష్ణ మండల బిజెపి అధ్యక్షుడు నల్లే నర్సప్ప



తెలిపారు. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కూడా ఎన్డీఏ కూటమి కైవసం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో, విద్యావంతుల్లో ఎంతటి వ్యతిరేకత ఉందో స్పష్టం చేస్తోందన్నారు.

అధికారంలో ఉండి, అన్ని హంగులు ఉన్నా కాంగ్రెస్ ఒక్క స్థానం కూడా గెలవ లేకపోవడం వారి పాలనా వైఫల్యానికి నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు లాంటి మేధావి వర్గం కూడా కాంగ్రెస్ ను తిరస్కరించి బీజేపీ - ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడం శుభపరిణామం అన్నారు.

ఇది కేవలం ఎన్నికల విజయం కాదు, ధర్మం గెలిచిన విజయం, ఎన్డీఏ పై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనం అన్నారు. కర్ణాటకలో మార్పును కోరుకుంటూ ఎన్డీఏ కూటమికి ఓటు వేసి గెలిపించిన పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కర్ణాటకలో మొదలైన ఈ మార్పు త్వరలో తెలంగాణలో కూడా రాబోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు.

## పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**మక్తల్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని నారాయణపేట జిల్లా



బీజేపీ ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి పిలుపునిచ్చారు. మక్తల్ మండలం పారేవుల గ్రామంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు కర్నేస్వామి, ప్రతాపరెడ్డి, జావిద్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికలపై నేరాల దర్యాప్తులో జాప్యం వద్దు...

• 60 రోజుల్లో అత్యాచారం, పోక్సో కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి: వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి

**వనపర్తి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** మహిళలు, బాలికలపై జరిగే లైంగిక నేరాల కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించాలని వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఇన్‌చార్జి డీజీ విశ్వజిత్ కంపటి బుధవారం జిల్లా అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. మహిళా భద్రతా విభాగం పనితీరు, ఆర్థిక నిర్వహణ, భరోసా కేంద్రాల సేవలు, మహిళలు, బాలికలపై జరిగే లైంగిక నేరాల కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్షించారు.





ఈ సందర్భంగా అత్యాచారం, పోక్సో కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులోగా, ముఖ్యంగా 60 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీజీ సూచించారు. లైంగిక నేరాల దర్యాప్తు పురోగతిని పర్యవేక్షించే వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి, కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు.

భరోసా కేంద్రాల ద్వారా బాధిత మహిళలు, బాలికలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, కేంద్రాల నిర్వహణను పటిష్టంగా కొనసాగించాలని సూచించారు. మహిళా భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై నేరాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో వనపర్తి నేర పరిశోధన విభాగం డీఎస్పీ బాలాజీ, భరోసా కేంద్రం ఎస్సై అంజద్, మహిళా భద్రతా బృందం, భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో
# వీధి కుక్కల బెడద.. చిన్నారిపై దాడి



**బాలానగర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** బాలానగర్‌లో వీధి కుక్కల బెడద పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో సమస్యను పరిష్కరించాలని వార్డు సభ్యులు రాఘవేందర్, రొయ్యల సతీష్, గ్రామస్థులు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి, చిన్నారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

## ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులను ఇబ్బంది పెట్టొద్దు

• ఓటరు నమోదు సులభతరం చేయాలి: ఏళ్ల సురేందర్ రెడ్డి



**ఉప్పునుంతల (జనంసాక్షి):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని కార్యాలయాలకు పిలిచి ఇబ్బందులకు గురిచేయవద్దని బీజేపీ కిసాన్ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఏళ్ల సురేందర్ రెడ్డి కోరారు. కొంత మంది అధికారులు గెజిటెడ్ అధికారి సంతకాలు, ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. అవసరమైతే బూత్ స్థాయి అధికారులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ధ్రువీకరణ చేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించాలని, ఫిర్యాదులపై రాష్ట్ర ఎన్నికల సంఘం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రతిభకు పేదరికం అడ్డంకి

• వైద్యుడిగా ఎదిగి పేదలకు సేవ చేయడమే లక్ష్యం..
• దాతల సహాయం కోసం ఎదురుచూపు



**పెంట్లవెల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** చదువులో ప్రతిభ చాటుకుని వైద్యుడిగా ఎదిగి పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలానికి చెందిన విద్యార్థి సూర్యప్రసాద్‌కు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ, ఫీజులు చెల్లించే స్థోమత లేక చదువును కొనసాగించడం కష్టంగా మారింది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహాయం అందించాలని కుటుంబం కోరుతోంది.

సూర్యప్రసాద్ పదో తరగతిలో 9.0 జీపీఏ, ఇంటర్మీడియట్‌లో 950 మార్కులు సాధించాడు. నీట్ పరీక్షలో 402 మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో 6,000 ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 320వ ర్యాంకు సాధించాడు. ఈ ప్రతిభతో హైదరాబాద్‌లోని నోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు పొందాడు. అయితే వైద్యవిద్యకు అవసరమైన ఫీజులు, ఇతర ఖర్చులు భరించడం కుటుంబానికి భారంగా మారింది. సూర్యప్రసాద్ తండ్రి వెంకటస్వామి డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి దేవేంద్రమ్మ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇద్దరు కుమార్తెల్లో ఒకరికి వివాహం కాగా, మరొకరు బీఈడీ చదువుతున్నారు. పరిమిత ఆదాయంతో కుటుంబ అవసరాలు తీర్చడమే కష్టంగా ఉండటంతో కుమారుడి వైద్యవిద్య ఖర్చులు భరించలేని పరిస్థితి నెలకొంది. ప్రతిభ ఉన్న విద్యార్థుల కలలు పేదరికంతో ఆగిపోకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. దాతలు, విద్యాభిమానులు, సేవా సంస్థలు సూర్యప్రసాద్‌కు ఆర్థిక సహాయం అందిస్తే వైద్యవిద్య పూర్తిచేసి పేదలకు సేవచేసే అవకాశం కలుగుతుందని కుటుంబ సభ్యులు ఆశిస్తున్నారు. సహృదయంతో ముందుకొచ్చి తమ కుమారుడి చేయూతనివ్వాలని కోరుతున్నారు.

# ప్రతిభకు పేదరికం అడ్డు కారాదు...

• శతశాతం విద్యా కార్యక్రమానికి రాజన్న ఫౌండేషన్, అమర రాజా సంస్థల అండ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదని, వారికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో, వందేమాతరం ఫౌండేషన్ అకడమిక్ సహకారంతో నిర్వహిస్తున్న 'శతశాతం విద్యా కార్యక్రమం'లో భాగంగా విద్యా వాలంటీర్లకు మూడో నెల గౌరవ వేతనాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా 100 మంది విద్యా వాలంటీర్లకు రూ.10 లక్షల చెక్కును అందించారు. పట్టణంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వాలంటీర్ల సేవలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఫౌండేషన్, అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సహకారం అందించడం అభినందనీయమన్నారు. విద్యారంగ అభివృద్ధి సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, మరిన్ని సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.

జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ శతశాతం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందించి, సమాజ అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమానికి రూపకల్పన చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.




అమర రాజా సంస్థ ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ శతశాతం విద్యా కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. 45 మంది విద్యా వాలంటీర్లకు ప్రతి నెలా గౌరవ వేతనం అందించేందుకు తమ సంస్థ సహకరిస్తోందని వెల్లడించారు. ఈ సహకారం కార్యక్రమ నిర్వహణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ ప్రతినిధి సతీష్, ఎంఎంఓ దుంకుడు శ్రీనివాస్, కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ సీజే బెనహర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ గుముడాల గోవర్ధన్ గౌడ్, వివిధ కళాశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యమే
# రైతులకు శాపం: మాజీ ఎమ్మెల్యే బీరం

• కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించి సాగునీరు అందించాలి

**పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనే రైతులకు కరువును తెచ్చిపెట్టిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. బుధవారం కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి కాలువలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టుల పరిధిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ కాలువల్లో జమ్ము, పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదని అన్నారు.



పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే కాలువల్లో అడ్డంకులు తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు రైతులకు సాగునీరు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు ముందుగా కాలువలను సందర్శించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తర్వాతే మంత్రి పర్యటనకు వచ్చారని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో కల్వకోల్ సర్పంచ్ బంట్రోత్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్ రావు, మాజీ స్పోర్ట్స్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ గౌడ్, వైస్ చైర్మన్ రాము యాదవ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పొదుపుపై రైతులకు అవగాహన



**అమరచింత, అక్టోబర్ 28 (జనంసాక్షి):** అమరచింతలో భూగర్భ జలమట్టాలు తగ్గిపోతున్న నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీజోమీటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, భూగర్భ జల శాఖ ఏడీ ఉమేష్, మండల వ్యవసాయ అధికారి అరవింద్, ఉద్యానవన అధికారి సురేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూగర్భ జలాలను అవసరానికి మించి వినియోగించడం వల్ల నీటిమట్టాలు పడిపోతున్నాయని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుతూ తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 14 గ్రామాల సర్పంచులు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## దారి లేని తండా.. ముళ్ల పొదల్లో విద్యార్థుల ప్రయాణం!

**సిర్గాపూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం సర్పంచ్ తండా పరిధిలోని రాజేశ్వర్ తండా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్నారు.పంట పొలాల గట్లపై ముళ్ల పొదల మధ్య నుంచి ప్రతిరోజూ బడికి వెళ్లాల్సి వస్తోందని తండావాసులు తెలిపారు.

అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా తమ తండాకు దారి ఎప్పుడొస్తుందని చిన్నారులు ప్రశ్నిస్తున్నారు.

## మెడికల్ షాపుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి



**గద్వాల (జనంసాక్షి):** మెడికల్ షాపుల్లో రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు డీఎం హెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. నకిలీ, గడువు ముగిసిన మందుల విక్రయాలను అరికట్టి, ఉల్లంఘన దారులపై చర్యలు తీసు కోవాలని కోరారు.

## ఎల్‌నినోతో నీటి ఎద్దడి ముప్పు




**అచ్చంపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే ప్రమాదముందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. నీరు, విద్యుత్ పొదుపు చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# గంగకత్వ కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు...

- నవంబర్‌లో మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన..
- 2028 జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభం
- కాలువను పరిశీలించి ఈత కొట్టిన జగ్గారెడ్డి





**సంగారెడ్డి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం రూ.37 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సదాశివపేట మండలం సూరారం గ్రామంలోని ప్రాజెక్టును పరిశీలించారు. సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. కాలువ ఆధునీకరణతో చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**లీకేజీల నివారణకు చర్యలు...**

కాలువ లైనింగ్, దెబ్బతిన్న భాగాల మరమ్మతులు, సీసీ లైనింగ్, తూముల పునరుద్ధరణ, వంతెనల వెడల్పు పెంపు తదితర పనులను సమీక్షించారు. కాలువ నీరు చెరువులకు సక్రమంగా చేరేలా, లీకేజీలు నివారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చందాపూర్, పొట్పల్లి, యెన్కేపల్లి, ఆత్మకూరు, అంకెన్‌పల్లి తదితర గ్రామాల రైతులు తెలిపిన సమస్యలను పరిశీలించి, అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని కోరారు.

**ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలు...**

గంగకత్వకు నీరు వచ్చే వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని జగ్గారెడ్డి తెలిపారు. ప్రాజెక్టు, వాగులో పూడిక తొలగింపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. మంజీరా బ్యాక్‌వాటర్‌తో పంటలు మునుగుతున్న కొల్కూరు–నిజాంపూర్ ప్రాంతంలో చెక్‌డ్యామ్ నిర్మాణ ప్రతిపాదనను కూడా పరిశీలించాలని అధికారులను కోరారు.

**2028 నాటికి పనులు పూర్తి...**

నవంబర్‌లో మంత్రుల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన జరిగేలా చూస్తామని, డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. 2028 జూన్ నాటికి పనులు పూర్తిచేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. పర్యటన సందర్భంగా గంగకత్వ కాలువలో జగ్గారెడ్డి డైవ్ చేసి ఈత కొట్టారు.

## బాధిత కుటుంబానికి అంబేద్కర్ చేయూత సైన్యం ఆర్థిక సాయం



**రేవల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** తల్పునూర్ గ్రామానికి చెందిన కేతేపల్లి తిరుపతమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో డా.బి.ఆర్.అంబేద్కర్ చేయూత సైన్యం స్పందించి, ఆమె కుమారుడు మద్దిలేటికి రూ.5,000 ఆర్థిక సాయం అందించింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుర్మయ్య, సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన



**ఉప్పునుంతల (జనంసాక్షి):** పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లో మోడల్ స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై పుట్ట మహేష్ పోలీసుల విధులు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

# రూ.2 కోట్లతో వేసిన బీటీ రోడ్డు నాణ్యత ఎక్కడ?

- నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు..
- బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు



**మహమ్మదాబాద్,అక్టోబర్ 28 (జనంసాక్షి):** నంచర్ల నుంచి చౌదర్‌పల్లి వరకు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు నాణ్యతపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈరహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని విమర్శించారు. బుధవారం రహదారిని పరిశీలించిన వారు,నిర్మాణ పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్,మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోపాల్‌రెడ్డి, గాధిర్యాల్‌మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మాట్లాడుతూ..నంచర్ల నుంచి చౌదర్‌పల్లి వరకు సుమారు రూ.2కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు.ఈపనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం రాములు,కాంట్రాక్టర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. రహదారికి ఇరువైపులా మట్టి కోతకు గురయ్యే పరిస్థితి కనిపిస్తోందని,వర్షం పడితే రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రోడ్డు పక్కనే ఉన్న భారీ గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు గుంతలో పడి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రజాధనంతో నిర్మించిన రహదారుల పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని,సంబంధిత అధికారులు రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి.నాణ్యతపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న గుంతను వెంటనే పూడ్చి,రహదారికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ,నాయకులు,కోరారు.

**బీటీ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు.. బీఆర్ఎస్ నాయకులు దుర్షప్రచారం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ**



మండలంలోని నంచర్ల నుంచి చౌదర్‌పల్లి వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ గా కేఎం రాములు ఉన్నారు.ఈవిషయంపై బీటీరోడ్డు పనులు పూర్తికాలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ,పిఎస్ సిఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి,కమతం విష్ణువర్ధన్ రెడ్డి,సర్పంచుల సంఘం అధ్యక్షుడు జె రామ్ లాల్,స్పష్టం చేశారు.బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత కొన్ని సంవత్సరాలుగా నిర్మాణానికి నోచుకోని రహదారికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలిపారు.రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాకముందే బీఆర్ఎస్ నాయకులు నాణ్యతపై విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ప్రజాధనంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుంటే,వాటిపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు.తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిననే కారణంతో రాజకీయంగా ఎదగకుండా కొందరు బీఆర్ఎస్ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని నారాయణ ఆరోపించారు.రహదారి నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయని,రోడ్డుపై ఎక్కడైనా గుంతలు ఉన్నచోట అవసరమైన రక్షణ గోడలు(గ్రైడ్‌వాల్స్)నిర్మిస్తామని తెలిపారు.పనులు పూర్తికాకముందే విమర్శలు చేయడం కంటే,నిర్మాణం పూర్తయ్యాక నాణ్యతను పరిశీలించాలని ఆయన సూచించారు.ప్రజలకు నాణ్యమైన రహదారి అందించడమే తమ లక్ష్యమని కేఎం నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ,మాజీ సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీటీ రోడ్డుతో భూములకు పెరిగిన విలువ...**

నంచర్ల నుంచి చౌదర్‌పల్లి వరకు రూ.2 కోట్లతో నిర్మించిన బీటీ రహదారితో పరిసర ప్రాంతాల అభివృద్ధికి మార్గం సుగమమైంది.సుమారు ఆరు గిరిజన తండాల ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడనుంది.గతంలో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు, విద్యార్థులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా మారనుంది. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో రహదారి వెంబడి ఉన్న వ్యవసాయ భూముల విలువ కూడా పెరిగే అవకాశం ఉందని స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



- రైతు పుల్లరి శ్రీను, నంచర్ల గ్రామం